వలంటీర్లే సంక్షేమ వారధులు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



పెద్దతిప్పసముద్రంలో వలంటీర్లకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్న వలంటీర్లే సంక్షేమ వారధులని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన సొంత డబ్బుతో సమకూర్చిన దుస్తులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్క రాష్ట్రాల పాలకులు సైతం ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నారని, ఇక్కడ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి రాష్ట్రాల్లో అమలు చేసేలా అందరి దృష్టిని ఆకర్షించిన ఘనత రాష్ట్ర సీఎంకు దక్కడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఘనత మాది కాదని వాటిని అర్హులకు చేర్చిన ఘనత వలంటీర్లదే అన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు పాలనలో అంతా అవినీతిమయంగా ఉండేదని, పచ్చ పాలకులు అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్లే తమ బలమని అందుకే, తాము అవినీతి రహిత పాలన అందిస్తున్నామని ధీమా వ్యక్తం చేసారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. అదే విధంగా లబ్ధిదారులకు ఇంకా ఏం అవసరమో వివరాలను సమగ్రంగా నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఇంటింటికీ ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ, కుమార్‌రెడ్డి, రియాసత్ అలీఖాన్, కేవీ రమణ, ఖాదర్‌వలి, తమక శంకర, కార్యం చంద్ర, సుబ్రమణ్యంరెడ్డితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ టికెట్లలో రాయితీ

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో దూర ప్రాంతాలకు రాను,పోను టిక్కెట్లు బుక్ చేసుకుంటే పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభ్యంతరాల స్వీకరణ

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీ నేల మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆర్జితసేవా టికెట్ల ధరలను పెంచేందుకు నిర్ణయించినట్లు ఈఓ మంజుల తెలిపారు. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. గురువారం నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ...ఆలయ అభివృద్ధిలో భాగంగా స్వామివారి అభిషేక, ప్రత్యేక పూజ రూ.500, ప్రత్యేకదర్శనం రూ.50 తదితర ఆర్జిత సేవా టికెట్ల ధరలను పెంచేందుకు నిర్ణయించామన్నారు. అభ్యంతరాలను జూలై 1లోపు లిఖిత పూర్వకంగా గ్రూప్ టెంపుల్స్ ఆఫీస్, వాల్మీకిపురంలో లేదా 9704574970 కు వాట్సప్ ద్వారా కాని తెలపవచ్చన్నారు.

పాలు, పండ్లు పంపిణీ



ఆశ్రమం చిన్నారులకు స్వీట్లు అందజేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని నవాబు కోట పంచాయతీ బెట్టకొండకు చెందిన ఉయ్యాల మారపరెడ్డి వర్ధంతి సందర్భంగా యంగ్ ఇండియా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం బెంగళూరులోని గార్డెన్ సిటీ ఆశ్రమంలో 60 మంది పిల్లలకు పండ్లు, పాలు, స్వీట్లు పంచి పెట్టారు. రాజారెడ్డి కుటుంబీకులు, యంగ్ ఇండియా సేవా సమితి అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

చురుగ్గా వేరుశనగ సాగు



వేరుశనగ విత్తనాలు విత్తుతున్న రైతులు

పీలేరు రూరల్ : మండలంలో వేరుశనగ సాగు చురుగ్గా జరుగుతోంది. గత నాలుగు రోజులు వర్షాలు కురవడంతో వేరుశనగ విత్తనాలు విత్తడానికి మంచి అదును ఏర్పడింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వేరుశనగ విత్తడంలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వేరుశనగ సాగుకు రైతు భరోసా డబ్బులు జమ కావడంతోపాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందజేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 6425 ఎకరాలుగా ఉన్నట్లు ఏవో రమాదేవి తెలిపారు.

విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాల అందజేత



నోటుపుస్తకాలు అందజేస్తున్న లక్ష్మీదేవి

కురబలకోట : మండల పరిధి కనసానివారిపల్లె సచివాలయంలోని గుణకుంట్లవారిపల్లెకు చెందిన పి.వెంకట్రమణ ప్రతి ఏటా సమీపంలోని ములకవారిపల్లె ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు పలకలు, నోటుబుక్కులు, పెన్సిళ్లు విరాళంగా అందజేసేవారు. అతను గత ఏడాది మృతి చెందాడు. భర్త పారంపర్యాన్ని కొనసాగించాలన్న సంకల్పంతో ఆయన జ్ఞాపకార్థం భార్య లక్ష్మీదేవి గురువారం 60 మంది విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్కులు, పెన్సిళ్లు అందజేసి పెద్దమనసు చాటుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు ఆమెను అభినందించారు.

రూ.15 లక్షలతో సీసీ రోడ్లు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న పీఆర్ డీఈ భాస్కర్

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ నగిరిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ డీఈ భాస్కర్ తెలిపారు. గురువారం పనులు పరిశీలించిన ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులతో కిలో మీటరు మేరకు నగిరి నుంచి తలపుల-అడవిపల్లె రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామానికి సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ తరుణ్, సర్పంచ్ శిరీష సందీప్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకట్రమణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : భాకరాపేట చెక్ పోస్టు వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. 34 మంది వాహనాదారులపై కేసులను నమోదుచేసి వారికి రూ. 5,090 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సచివాలయాల సిబ్బంది
సక్రమంగా సేవలందించాలి



బసినికొండ-2 సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : సచివాలయాల సిబ్బంది సక్రమంగా ప్రజలకు సేవలందించాలని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా బాధ్యత వహించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. గురువారం ఎంపీడీఓ భానుప్రసాద్‌తో కలిసి మండలంలోని బసినికొండ-1, 2 గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ పరిశీలించారు. ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా స్పెషల్‌ఆఫీసర్ అహ్మద్‌బాబు బుధవారం బసినికొండ-1 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది కార్యాలయ, విధుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసి వెళ్లారు. సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌లను సచివాలయాలను పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు. దీంతో బసినికొండ-1,2 సచివాలయాలను డీఎల్‌డీఓ, ఎంపీడీఓ సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సేవలను నిరుపేదల ఇళ్ల వరకూ తీసుకెళ్లేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చే దిశగా సిబ్బంది పని చేయాలన్నారు. ప్రతి రోజూ సచివాలయ పరిధిలో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించాలని, వాటిని అదే రోజు సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. శాఖల వారీగా సచివాలయ ఉద్యోగుల వర్క్‌ప్లాన్‌ను అడిగి తెలుసుకున్నారు. స్పందన, సీసీఆర్‌సీ కార్డులు, ఈ క్రాప్, సర్వే, రికార్డుల నిర్వహణ, అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది గ్రామసమాచారం మొత్తం తెలుసుకోవాలని, సచివాలయ పరిధిలోని పిల్లలు, మహిళలు, పాలిచ్చే తల్లులు, బాలికలు, డ్రాపౌట్స్ స్టూడెంట్స్, అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటికి సంబంధించి సమస్త సమాచారం తెలిసి ఉండటమే కాకుండా, కార్యాలయంలోని ప్రతి రికార్డు అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి వెళ్లేలా చదవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాత సిద్ధప్ప

వాల్మీకిపురం : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి వెళ్లాలనే పట్టుదలతో చదవాలని విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సిద్ధప్ప అన్నారు. గురువారం మండలంలోని విఠలం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్, బాక్స్, బిస్కెట్లు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత గ్రామం కావడంతో గత కొన్నేళ్లుగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్ రెడ్డి, వసంత్ కుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మునీశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యార్డులో జాక్‌పాట్‌ను రద్దు చేయాలి



మార్కెట్‌కమిటీ సెక్రటరీకి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మదనపల్లె : టమాట మార్కెట్ యార్డులో రైతులను మోసం చేస్తున్న జాక్‌పాట్‌ను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ... మార్కెట్‌యార్డులో కొంత మంది వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రైతుల నుంచి 4 శాతం కమీషన్ తీసుకోకుండా 10 శాతానికి పైగా వసూలు చేస్తున్నారన్నారు. మార్కెట్‌యార్డులో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, క్యాంటీన్‌ను ప్రారంభించాలని కోరారు. వర్షం పడితే యార్డు మొత్తం బురదమయంగా మారుతుండటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడమే కాకుండా లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఇబ్బందిగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణప్ప, సాంబశివ, రైతుసంఘం నాయకులు హరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి



విద్యార్థిని వద్ద సమాధానాలు రాబడుతున్న డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం

కలకడ : జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి, కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం ఆదేశించారు. కలకడ మండలంలోని ముడియంవారిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు నాగలక్ష్మమ్మ పనితీరు, పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచ్ శాంతమ్మలు కలిసి ఆ ఉపాధ్యాయురాలు ఉంటే తమ పిల్లలందరికీ టీసీ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యపై స్పందించిన డీఈఓ కొంత సంయవనం పాటించాలని, ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో ఖర్చు చేస్తోందని గుర్తు చేశారు. తరగతి గదిలో చిన్నారుల నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనం రోజువారి మెనూ ప్రకారం అందుతుందా లేదా అని పరిశీలించి, రుచి చూశారు. నివేదికలు సిద్ధం చేయాలని యంఈఓ మునీంద్రనాయక్‌ను ఆదేశించారు. జగనన్న విద్యాకిట్(జేవీకే) నిల్వ ఉంచిన ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి మండలానికి వచ్చిన స్టాక్ పంపిణీ అయిన వివరాలు, నిల్వ స్టాక్ తనిఖీ చేశారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవన నిర్మాణం, ప్రహరీగోడ నిర్మాణం పూర్తి చేసి బాలికల హాస్టల్‌ను వినియోగంలోని తీసుకురావాలని కోరారు. ఇది వరకూ జరిగిన పనులు, నిధులు, చేపట్టవలసిన పనులు మొత్తం ఖర్చు అంచనాలు సిద్ధం చేసి అందజేయాలని విద్యాశాఖ మంత్రికి నివేదించడం జరుగుతుందని డీఈఓ పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, ఎంఆర్‌పీలు శ్రీకాంత్, గిరిబాబు, చంద్రకళ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రాయచోటి అర్బన్ : యువత, విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీఎస్పీ బి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాల సేవించడం వలన అనారోగ్యానికి గురవుతారన్నారు. మత్తుకు బానిసైతే మనిషి కేంద్ర నాడీ మండల వ్యవస్థ దెబ్బతిని అనారోగ్యానికి గురై ఆర్థికంగా, శారీకంగా, మానసికంగా ఇబ్బందుల పాలవడమే కాకుండా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలవుతారంటూ వివరించారు.

పండుగను శాంతియుతంగా జరుపుకోండి

ఓబులవారిపల్లె : బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ముస్లింలు, హిందువులు సోదరభావంతో మెలగాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకూడదని సూచించారు. కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, హెడ్ కానిస్టేబుల్స్ రామచంద్రయ్య గౌడ్, వలి, షేక్ మస్తాన్ వలి, సయ్యద్ మౌలా బాషా, ఖాదర్ సాహెబ్, షేక్ ఖలీల్, సుబ్బరాయుడు ఆచారి, బాలసుబ్రమణ్యం, ఉపేంద్ర, మల్లికార్జున, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

రైల్వేకోడూరు : మండలంలోని దేశెట్టిపల్లిలో ఉన్న అనాథ శరణాలయంలో గురువారం కడప విద్యుత్ సామాజిక సేవ సంస్థ ద్వారా నిత్యావసర సరుకులు, బియ్యం, చింతపండు, కూరగాయలను అందజేశారు. కార్యక్రమంలో కడప ఎస్ఈ రమణ, సామాజిక సేవ అధ్యక్షుడు చలపతి, ఈఈ నాగరాజు, డీఈఈ భరణి క్రిష్ణ, డీఈఈ భాస్కర్‌రావు, ఏఈ యోగానంద, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8వ తరగతులలోని ఖాళీలను భర్తీ చేయడానికి గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శ్యామలా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 24న ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత, ప్రతిభ రోస్టర్ ఆధారంగా ఎంపికలు జరుగుతాయని ఆమె తెలిపారు.

లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్..

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన 7,8,9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈనెల 28వ తేదీలోగా ఆధార్ కార్డు జిరాక్స్ తగు సర్టిఫికెట్లతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్ష నిర్వహించి విద్యార్థులను మెరిట్ ద్వారా ప్రవేశం ఉంటుందని తెలియజేశారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

రామాపురం : ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు గురువారం మండలంలోని రాచపల్లి, హసనాపురం గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయల కోత తర్వాత ఆచరించాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతుకు ఉద్యానవన శాఖ అధికారిణి టి.నాగమణి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ మామిడి తోటలలో కాయలు కోసిన అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రాజంపేట : సౌమ్యనాథ బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 27 నుంచి మొదలయ్యే ఉత్సవాలకు తితిదే సర్వం సిద్ధం చేస్తోంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, భక్తులకు క్యూలైన్లు, అన్నప్రసాదాల వితరణకు షెల్టర్లు నిర్మిస్తున్నారు. అలాగే జులై4న జరిగే కల్యాణోత్సవానికి వేదిక, భక్తులకు కూర్చునేందుకు చేయాల్సిన చర్యలను తీసుకుంటున్నారు. ఆలయంలో ద్వారపాలకులకు కవరింగ్, స్వామివారు ఊరేగే వాహనాలను ముస్తాబు చేస్తున్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పెనగలూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రభుత్వ పాఠశాలలకు ఆర్‌బీఐ వారు ఆల్ ఇండియా క్విజ్ ఫైనాన్సియల్ లిటరసీ 2023పై పోటీలు నిర్వహించారు. మండలస్థాయి పోటీలలో మోడల్ స్కూల్ విద్యార్థునులు మౌనిక, గోపి చందనలు ప్రథమ బహుమతి సాధించి రూ.5 వేలు నగదు అవార్డు, సర్టిఫికెట్లు పొందారు. దీంతో విద్యార్థునులను మోడల్ స్కూల్ పాఠశాల సిబ్బంది అభినందించారు. జగనన్న ఆణిముత్యాలలో భాగంగా పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలను పాఠశాల కమిటీ చైర్మన్ శివకుమార్ ద్వారా అందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరా మెరుగుకు రూ.17 కోట్ల నిధులు



గుట్టకిందపల్లె సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న పబ్లిక్‌హెల్త్ ఎస్ఈలు శ్రీనాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి

మదనపల్లె : పట్టణంలో నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరిచేందుకు జాతీయస్థాయిలో జరిగిన అపెక్స్ కమిటీలో అమృత్-2.0 కింద మున్సిపాలిటీకి రూ.17.65 కోట్ల నిధులు మంజూరయ్యాయని పబ్లిక్ హెల్త్ ఎస్ఈలు శ్రీనాథరెడ్డి(అనంతపురం), గోపాల్ రెడ్డి(నెల్లూరు) తెలిపారు. గురువారం పట్టణానికి విచ్చేసిన వారు మొదట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో సమావేశమయ్యారు. పట్టణంలోని నీటి సరఫరా వ్యవస్థ, అమలవుతున్న పథకాలపై చర్చించారు. నీటిసరఫరాను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఖర్చు చేయాల్సిన నిధులపై డీపీఆర్ తయారు చేయాల్సిందిగా ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద మున్సిపాలిటీకి మంజూరైన రూ.17.65 కోట్ల నిధులను నీటిసరఫరా వ్యవస్థ మెరుగుపరిచేందుకు ఖర్చు చేసి పట్టణంలో తాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీలోని 1, 2 వార్డుల్లో నీటి సమస్య అధికంగా ఉన్నట్లు ఎస్ఈ, డీఈల దృష్టికి తెచ్చారు. వేంపల్లె వాటర్‌వర్క్స్ నుంచి నీరుపైకి వెళ్లకపోవడంతో సమస్య తలెత్తుతోందన్నారు. నీటిశుద్ధికేంద్రాల నుంచి నీరు అమ్మచెరువుమిట్ట, వైఎస్సార్ కాలనీలకు వెళ్లేలా చేసి అక్కడ నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నింపాక సరఫరా చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని గుట్టకిందపల్లె సమ్మర్ స్టోరేజిని పరిశీలించి, నీటినిల్వ సామర్థ్యం, వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్, పెండింగ్ వర్క్స్, పైప్‌లైన్ తదితరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కడప ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈలు పుష్పగిరి నాయక్, సతీష్, డీఈ బండపల్లి శిరీషా, ఏఈ ఆంజనేయులు, స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలుగా బాధ్యతల స్వీకరణ



ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డిలను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కేవీపల్లె : కేవీపల్లె మండల విద్యాశాఖ అధికారులుగా రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో కేవీపల్లె ఎంఈవోగా పని చేసిన ఎంఈవో రెడ్డిబాషా పీలేరుకు బదిలీపై వెళ్లి తిరిగి కేవీపల్లె 1వ ఎంఈవోగా బదిలీ అయ్యారు. పలమనేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న సుబ్రమణ్యంరెడ్డి పదోన్నతి పొంది కేవీపల్లె 2వ ఎంఈవోగా నియమితులయ్యారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఇద్దరిని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్, యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ఎస్టీయూ నాయకులు భాస్కర్‌రెడ్డి పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అమరనాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లు, చెంగల్‌రాయులు, సుబ్రమణ్యం, నందకుమార్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు



ప్రజలతో మాట్లాడుతున్న జి.వి.రాకేష్‌రెడ్డి

పీలేరు : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు యువ పారిశ్రామికవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.వి.రాకేష్ రెడ్డి అన్నారు. గురువారం బండ్లవంకలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించడంతోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, హుమయూన్, కృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, నాగభూషణం, ఉదయ్‌కుమార్, షాకీర్, నరేష్‌రామ్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కాలనీచిన్న, ఉబేదుల్లా, మునీర్, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బియ్యం అందించండి



డీలర్లు, యండియూ ఆపరేటర్లు సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రదీప్

కలకడ : మండలంలోని బియ్యంకార్డు దారులకు సకాలంలో ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించకుంటే యండియూ ఆపరేటర్లు, ప్రభుత్వ చౌక దుకాణ డీలర్లు ఇంటికే అని తహసీల్దార్ ప్రదీప్ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ చౌకదుకాణ డీలర్లు, యండియూ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి డీలరు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, డీలర్ వారి లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించి దుకాణంలో అందుబాటులో ఉంచాలన్నారు. గోడౌన్ పాయింట్ నుంచి స్టాక్ రాగానే రిలీజ్ ఆర్డర్ వేసి యండియూ ఆపరేటర్‌కు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. మండల స్టాక్ పాయింట్ వద్ద తూకం వేసుకుని తీసుకోవాలని, అదే విధంగా యండియూ ఆపరేటర్‌కు తూకం వేసి బియ్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రోజు డీలర్ వద్ద స్టాక్ తీసుకుని రాత్రి సమయానికి విధిగా రిటర్న్ ఇవ్వాలని యండియూ ఆపరేటర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, డీలర్లు, చౌకదుకాణ డీలర్లు పాల్గొన్నారు.

పొగాకు వాడకం.. జీవిత కాలానికి ముప్పు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సిటి స్వామి

కలకడ : పొగాకు వాడకం-వ్యక్తి జీవిత కాలానికి ముప్పుగా ఉంటుందని ఎస్‌ఐ సిటి స్వామి అన్నారు. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పొగాకు వాడకం వల్ల క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని.. యువత, విద్యార్థులు అందుకు దూరంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులకు కూడా నివారణ ఉపాయాలను తెలియజేయాలని సూచించారు. పొగ తాగే వారి కంటే పక్కన పీల్చేవారికే ఎక్కువ ప్రమాదమని చెప్పారు. బహిరంగ ప్రదేశాలలో పొగ తాగరాదని అవగాహన కల్పించినా మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అవగాహన కల్పించడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాలక్రిష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో చిత్తూరుకు ఎంఆర్‌పీఎస్ నాయకులు



రామసముద్రం నుంచి చిత్తూరు సదస్సుకు బయలుదేరిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ నాయకులు

రామసముద్రం : చిత్తూరులోని డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ భవనంలో గురువారం జరిగిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ సదస్సుకు రామసముద్రం నుంచి నాయకులు తరలివెళ్లారు. జూలై 3వ వారంలో హైదరాబాద్‌లో 20 లక్షల మందితో జరిగే ఎంఆర్‌పీఎస్ మహాసభను జయప్రదం చేసేందుకు కింది స్థాయి నాయకులను, కార్యకర్తలను సమాయత్తం చేయడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సన్నాహక సదస్సు నిర్వహించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ సదస్సుకు రామసముద్రం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షుడు గంగాధర్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ కొండప్ప, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు విశ్వనాథ్, గుండ్లపల్లె శ్రీనివాసులు ఉన్నారు.

మొక్కలు మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీకి మొక్కలు మంజూరు చేయాలని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా వినతిపత్రం అందజేశారు. గురువారం మంత్రిని కలసి పీలేరు పంచాయతీలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని ఆయన కోరారు. పంచాయతీ పరిధిలో మొక్కలు నాటాలని సంకల్పించామని, అందుకు అవసరమైన జామ, దానిమ్మ, ఎర్రతురాయి, పచ్చతురాయి, బాదం, అల్లనేరేడు తదితరాలు మొత్తం 15 వేలు మొక్కలు కావాలని విన్నవించగా మంత్రి సానుకూలంగా స్పందించారు.